## గూడెంలో నేడు మెగా జాబ్‌మేళా

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

స్థానిక డిఆర్ గోయంకా మహిళా కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, ఇన్నోవ్ సోర్స్, అపోలో ఫార్మసీ, ఎల్ఐసి, యంగ్ ఇండియా, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంకు మొదలైన ప్రముఖ కంపెనీలతోపాటు మరికొన్ని ఇతర కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. వివిధ కంపెనీల్లో మొత్తం 700కుపైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆయా కంపెనీల నిబంధనలను అనుసరించి ఎంపిక ఉంటుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు skill universe apssdc.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని అడ్మిట్ కార్డుతో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

# రైల్వే ప్రయివేటీకరణ ఆపండి

**సిఐటియు ఆధ్వర్యాన రైల్వే స్టేషన్ల వద్ద ధర్నాలు - ప్రభుత్వ ఆస్తుల అమ్మకంలో మోడీ ముందంజ - సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శ**

**ప్రజాశక్తి - భీమవరం**

ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ముందంజలో ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. రైల్వేల ప్రయివేటీకరణను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో భీమవరం రైల్వేస్టేషన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే, విశాఖ ఉక్కు వంటి సంస్థలను ప్రయివేటుకు అప్పగించడంలో గత ప్రభుత్వాల కంటే మోడీ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఇది ప్రజలకు, దేశ ప్రయోజనాలకు చేటు తెచ్చేదని విమర్శించారు. ఇప్పటికే రైల్వేలో జరుగుతున్న ప్రమాదాలు, ప్రయివేటీకరణ వల్ల వచ్చే నష్టాన్ని తెలియజేస్తున్నాయన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక ఛార్జీలు పెంచడం, సౌకర్యాలను కుదించడంతోపాటు రిటైరైన వారి స్థానంలో కొత్త ఉద్యోగులను నియమించకపోవడం వల్ల వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటి ఫలితమే ప్రమాదాలకు కారణమని తెలిపారు. ఈ ప్రయివేటీకరణ విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని, రానున్న కాలంలో మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాసు, జి.శిరీష్‌కుమార్, సత్యనారాయణ, సత్యనారాయణ, వరలక్ష్మి, కృష్ణ, మునియ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో

**తాడేపల్లిగూడెం:** రైల్వే ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక రైల్వేస్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నాయకులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. రైల్వే స్టేషన్లను, వాటి చుట్టుపక్క ఉన్న స్థలాలను అంబానీలకు నామమాత్రపు లీజుకు బిజెపి ప్రభుత్వం కట్టబెడుతుందని విమర్శించారు. లాభాలు వచ్చే 150 రైల్వే రూట్లు కార్పొరేట్లకు ఇచ్చి, లాభాలు రాని గ్రామీణ ప్రాంత రూట్‌లను మూసేయడమే లక్ష్యంగా మోడీ ముందుకు సాగుతున్నారన్నారు. రైల్వేలో ప్రయివేటీకరణ విధానాల ఫలితంగానే రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రైల్వేను ప్రయివేటీకరణ బారి నుండి రక్షించుకోవడానికి అన్ని ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు, రైల్వేలోని ఉద్యోగ సంఘాలు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, సత్తి కోదండరామిరెడ్డి, కర్రి సాయిరెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, ఎస్‌వి.రెడ్డి, అడపా ఆంజనేయులు, మేడ్రెడ్డి రమణ, గొర్లి సతీష్‌కుమార్, నాగేంద్రబాబు, వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

భీమవరంలో..

**ఆకివీడు:** రైల్వేలో ప్రయివేటీకరణను వెంటనే ఆపు చేయాలని, కరోనా కాలంలో నిలుపుదల చేసిన రైళ్లను పునరుద్ధరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'రైల్వే ఆస్తులను కాపాడుకుందాం రండి' అంటూ రైల్వేల ప్రయివేటీకరణను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం స్టేషన్ అధికారి అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడుతూ స్థానిక రైల్వే స్టేషన్లో మౌలిక వసతులు, రెండో ప్లాట్‌ఫారంపై కనీస వసతులు కల్పించాలని, టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలని డిమాండ్ చేశారు. రైల్వేలో ఖాళీగా ఉన్న మూడు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. తగిన సిబ్బందిని నియమించి ప్రమాదాలను అరికట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు బొక్కా సత్యనారాయణ, పెంకి అప్పారావు, బొడ్డుపల్లి రాంబాబు, బివి.వర్మ, రాంబాబు, గండేటి ఈశ్వరరావు, రాంప్రసాద్, షేక్ వలీ పాల్గొన్నారు.

**తణుకు రూరల్:** రైల్వే ప్రయివేటీకరణను ఆపకుండా ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. పెంచిన రైల్వే టిక్కెట్ ధరలు తగ్గించాలని, తణుకు స్టేషన్లో లిఫ్ట్ సౌకర్యం వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, కామన మునిస్వామి, ఎం.రమేష్, ఎన్.చిన్నారావు, ఎన్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపీ, వి.వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరాజు, పి.దక్షిణామూర్తి, బ్రహ్మాజీ, రాము, టి.వెంకటేశ్వరరావు, టి.అప్పన్న, నర్సింహమూర్తి, పి.శివగణేష్, ఎన్.శ్రీనివాస్, ఐ.ధనరాజ్ పాల్గొన్నారు.

**ఉండి:** లాభాల్లో ఉన్న రైల్వేను ప్రయివేటీకరించొద్దని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక రైల్వే స్టేషన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల రవాణా సాధనం రైల్వేను ప్రయివేటీకరించొద్దని కోరారు. కార్యక్రమంలో చిప్పాడ బుచ్చేశ్వరరావు, కింతాడ రమేష్, కడలి నాగేశ్వరరావు, వంజరపు సూర్యనారాయణ, స్థానికులు గెద్దా భోగేశ్వరరావు, నాని పాల్గొన్నారు.

**నరసాపురం టౌన్:** రైల్వేల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ లక్షల కోట్ల రైల్వే ఆస్తులను అప్పనంగా కార్పొరేట్లకు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రజానీకం ఖండించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కవురు పెద్దిరాజు, సిఐటియు నాయకులు పొన్నాడ రాము, పొగాకు నారాయణరావు నోముల కొండ, పున్నాని అప్పలనాయుడు, చేతివృత్తుల సంఘం నేతలు కె.నరేష్, వాసా రామలింగం, కోడి లక్ష్మణ్ పాల్గొన్నారు.

**పాలకొల్లు:** రైల్వే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అంతా ఐక్యంగా పోరాడాలని సిఐటియు నేతలు అన్నారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీనివాస్, దేవ సుధాకర్, చల్లా సోమేశ్వరరావు, యర్రా అజయ్, టి.గంగరాజు, పురుషోత్తమ్, కె.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

తణుకులో..

నరసాపురంలో..

నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్, ఎంఎల్‌సి

## జంటలు ఆర్థికంగా ఎదగాలి

**వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద రూ.2.74 కోట్లు - జిల్లా కలెక్టర్ ప్రశాంతి**

**ప్రజాశక్తి - భీమవరం**

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా అందుకున్న జంటలు ఆర్థికంగా మరింత ఎదగాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా నాల్గో విడత కింద జులై-సెప్టెంబరు త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన జంటలకు ఆర్థిక సాయాన్ని అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 383 జంటలకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు ఆర్థిక సహాయం రూ.రెండు కోట్ల 74 లక్షల 40 వేలు మంజూరయ్యాయని తెలిపారు. 204 బిసి జంటలకు ప్రతి జంటకూ రూ.50 వేలు చొప్పున రూ.1.02 కోట్లు, 22 బిసి ఇంటర్ కేస్ట్ జంటలకు ప్రతి జంటకూ రూ.75 వేలు చొప్పున రూ.16.50 లక్షలు, 11 బిఒసిడబ్ల్యూడబ్ల్యూబి జంటలకు రూ.40 వేలు చొప్పున రూ.4.40 లక్షలు, ఐదు విభిన్నప్రతిభావంతుల జంటలకు రూ.1.50 లక్షలు చొప్పున రూ.7.50 లక్షలు, ఆరు మైనార్టీ జంటలకు ఒక్కో జంటకు రూ.లక్ష చొప్పున రూ.6 లక్షలు, 117 ఎస్‌సి జంటలకు ఒక్కో జంటకు రూ.లక్ష చొప్పున రూ.1.17 కోట్లు, 14 ఎస్‌సి ఇంటర్ కేస్ట్ జంటలకు రూ.1.20 లక్షలు చొప్పున రూ.16.80 లక్షలు, మూడు ఎస్‌టి జంటలకు రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు, ఒక ఎస్‌టి ఇంటర్ కేస్టు జంటకు రూ.1.20 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆర్థిక కారణాలతో మధ్యలోనే విద్యాభ్యాసం ఆపితే ఈ పథకాలతో చదువు కొనసాగించాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు, గ్రామ సచివాలయాల జిల్లా అధికారి కెసిహెచ్.అప్పారావు, సిపిఒ కె.శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి జి.గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

## 25న హైకోర్టు న్యాయమూర్తులు రాక

**ప్రజాశక్తి - భీమవరం**

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవి.శేషసాయి ఈ నెల 25వ తేదీన భీమవరం రానున్నారు. పట్టణంలోని శ్రీరామపురంలోని బిఎస్ఎన్ఎల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కోర్టు భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొనున్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు భవన ప్రారంభోత్సవం చేస్తారని మూడో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.శ్రీసత్యదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులు

## అత్యాచారం కేసులో ఉపాధ్యాయుడు అరెస్టు

**ప్రజాశక్తి - ఉండి**

విద్యార్థినికి మాయమాటలు చెప్పి లోబరుచుకుని పెళ్లి పేరిట అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. బాధిత విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు హిందీ ఉపాధ్యాయుడు పురెళ్ల సోమరాజును అరెస్టు చేశామని, నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని దిశా డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం రాత్రి ఉండి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు.

భీమవరం మండలం తాడేరుకు చెందిన పురెళ్ల సోమరాజు మండలంలోని యండగండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నాడు. అదే పాఠశాలలో చదివే బాలికతో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడిపాడు. ఆదివారం రాత్రి ఆ బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగానే తాడేరులోని తన ఇంటికి తీసుకెళ్లాడు. తాళి కట్టి మనకు పెళ్లయిపోయిందని చెప్పాడు. ఆపై బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. నాటి నుంచి ఆ ఇంట్లోనే బాలికను నిర్బంధించాడు. బాలిక బుధవారం అక్కడి నుంచి తప్పించుకుని ఇంటికొచ్చి తండ్రికి, బంధువులకు జరిగిన అఘాయిత్యాన్ని వివరించింది. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆకివీడు సిఐ కె.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు దిశ డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సోమరాజుకు ఇప్పటికే పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యతో మనస్పర్ధల కారణంగా విడిగా ఉంటున్నారు. వీరి విడాకుల కేసు కోర్టులో ఉంది. సోమరాజును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీకృష్ణ

## జగనన్నా.. ఇదేందన్నా..!

**రోడ్డెక్కిన మొగల్లు జగనన్న కాలనీవాసులు**

**తమ సమస్యల పరిష్కారం కోరుతూ రాస్తారోకో**

**అధికారుల హామీతో ఆందోళన విరమణ**

**సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా**

**ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్**

**ప్రజాశక్తి - పాలకోడేరు**

'స్థలమిచ్చారు కదా అని ఆనందపడి.. అప్పు చేసుకుని ఇంటిని నిర్మించుకున్నాం. మౌలిక సదుపాయాలు లేనప్పటికీ రెండేళ్ల నుంచి ఇక్కడే నివాసముంటున్నాం. తమ ఇళ్లకు చేర్చి ఉన్న ఆక్వా చెరువుల వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రెండేళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు' అంటూ మొగల్లు జగనన్న కాలనీవాసులు గురువారం రోడ్డెక్కారు.

మొగల్లులో 11 ఎకరాల 21 సెంట్లు భూమిని సేకరించి జగనన్న లేఔట్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో ఆరు గ్రామాలకు చెందిన 495 మందికి పట్టాలిచ్చారు. ఈ లేఔట్‌లోనే ఇళ్లు నిర్మించుకుని కాపురం ఉంటున్నారు. అయితే ఈ లేఔట్‌కి చేర్చి పెద్దసంఖ్యలో ఆక్వా చెరువులు ఉన్నాయి. ఇక్కడే మురుగు డ్రెయిన్ కూడా ఉంది. అయితే ఈ డ్రెయిన్ ఆక్రమణకు గురికావడం, అధికారుల నిర్లక్ష్యంతో పూడిపోయింది. ఆక్వా చెరువుల నీటిని ఈ డ్రెయిన్లోకి వదిలేయడంతో ఆ నీరు జగనన్న కాలనీని ముంచెత్తింది. నాలుగు రోజులుగా మోకాళ్లలోతు నీటిలో కాలనీవాసులంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కాలనీవాసులంతా మొగల్లు రంగా బొమ్మ సెంటర్ వద్ద తణుకు వెళ్లే రహదారిపై బైఠాయించారు. సుమారు గంటపాటు నిరసన కొనసాగడంతో ట్రాఫిక్ స్తంభించింది,. దీంతో తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.నాగేంద్రకుమార్, హౌసింగ్ ఎఇ నరసింహారావు, ఇరిగేషన్ అధికారులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఇప్పటివరకు అధికారులు ఎందుకు స్పందించలేదని బాధితులు నిలదీశారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అధికారుల వెంట ఆర్ఐ నాగభూషణంనాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు, విఆర్ఒ సురేష్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి రవీంద్రనాథ్

**సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్**

భీమవరం కలెక్టరేట్‌కు వెళ్తున్న ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్ రాస్తారోకో చేస్తున్న జగనన్న కాలనీవాసులతో మాట్లాడారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆందోళనకారులకు హామీ ఇచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఆయన జగనన్న కాలనీని పరిశీలించారు. జిల్లా కలెక్టర్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దృష్టికి సమస్యను తీసుకెళ్లానని ఎంఎల్‌సి ఆందోళనకారులకు చెప్పారు. మురుగుబోదె తవ్వకం నిమిత్తం సిద్ధం చేసిన ప్రతిపాదనలను తమకు అందించాలని హౌసింగ్ ఎఇ నరసింహారావును ఆదేశించారు.

**కాలనీ వాసులకు అండగా సిపిఎం**

జగనన్న కాలనీ వాసులకు సిపిఎం అండగా నిలిచింది. సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య, నాయకులు పాలా వెంకటస్వామి, వీరవల్లి వెంకటేశ్వరరావు, వి.లక్ష్మి బృందంగా వెళ్లి జగనన్న కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్న సంగతి తెలిసిందే. గురువారం ఆందోళనలో వారూ భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ్య మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం అభినందనీయమని, అయితే మౌలిక వసతులు కల్పించకపోవడం దుర్మార్గమని అన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ కాలనీవాసులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# పాయిజన్ కేసంటే రిఫరే..!

**ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందని వైద్య సేవలు**

**పురుగుల మందు తాగిన రోగుల పరిస్థితి దారుణం**

**విజయవాడకు రిఫర్, లేదంటే జనరల్ వార్డుకు తరలింపు**

**అత్యవసర వైద్యం అవసరమైనా ఐసియుకి తరలించని పరిస్థితి**

**రోగి బంధువులు నిలదీస్తేనే ఐసియుకి సిఫార్సు**

**అప్పటికే చేజారుతున్న ప్రాణాలు**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యం తాండవిస్తోంది. ముఖ్యంగా పురుగుల మందు (పాయిజన్) తాగిన రోగుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం కారణంగా రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఆసుపత్రిగా ఉండగా ఉత్తమ సేవలందించిన ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీగా మారిన తర్వాత రోగులకు సరైన వైద్యం అందించని దుస్థితి ఏర్పడిందనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది. సీనియర్ డాక్టర్లు ఇక్కడ నుంచి వెళ్లిపోవడం, వచ్చిన వారు రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదనే చర్చ రోగుల్లో నెలకొంది. దీంతో ఒకప్పుడు ప్రతిరోజూ దాదాపు 1500కుపైగా ఉండే ఓపి సేవలు ప్రస్తుతం తగ్గిపోయాయని చెబుతున్నారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ముఖ్యంగా పురుగులమందు తాగిన కేసులు జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికే వస్తుంటాయి. స్థానికంగా ఉన్న ఏ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినా పాయిజన్ కేసులను ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికే పంపిస్తున్నారు. అయితే ఇక్కడ మాత్రం వైద్యం అందకుండా పోతోంది. పురుగుల మందు తాగిన రోగికి ప్రథమ చికిత్సగా తాగిన మందును కక్కిస్తారు. తర్వాత అత్యవసర వైద్యం అందించాల్సి ఉంటుంది. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మాత్రం అందుకు భిన్నంగా నడుస్తోంది. ప్రాథమిక చికిత్స పూర్తయిన తర్వాత అత్యవసర వైద్యం అందాలంటే ఐసియుకి పంపించాల్సి ఉంటుంది. ఇక్కడ అలా జరగడం లేదు. ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత విజయవాడ తీసుకెళ్లాలంటూ రోగుల బంధువులను భయపెడుతున్నారు. మాట వినకుంటే జనరల్ వార్డుకు పంపించి సాధారణ రోగుల మాదిరిగానే పరిగణిస్తున్నారు. పాయిజన్ తీసుకున్న కేసులో రోగి పరిస్థితి గంటగంటకూ మారుతోంది. అత్యవసర వైద్యం అందించకుండా జనరల్ వార్డులో ఉంచడం ఏమిటని రోగి బంధువులు నిలదీస్తున్న ఘటనలు కోకొల్లలు. రోగుల బంధువులు నిలదీసిన తర్వాతే ఐసియుకి పంపిస్తుండటం గమనార్హం. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని రోగుల బంధువులు చెబుతున్నారు. ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఐసియు విభాగం పటిష్ఠంగా ఉంది. అక్కడ పని చేస్తున్న డాక్టర్లు మంచి వైద్యం అందిస్తారనే నమ్మకం రోగులకు సైతం ఉంది. అయితే అత్యవసర వైద్యం అవసరమైన పాయిజన్ కేసులను వెంటనే ఐసియుకి ఎందుకు పంపడం లేదో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. పురుగులమందు తాగిన వ్యక్తి తిరిగి కోలుకోవడం కొంచెం కష్టమై ఉండొచ్చు. అలాగని అత్యవసర వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రోగుల బంధువులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అత్యధిక కేసులను విజయవాడకు రిఫర్ చేస్తున్నారనే అపవాదు ఇప్పటికే ఏర్పడింది. ఆసుపత్రిలో వైద్య సదుపాయాల అందజేతపై సరైన పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎంతోమంది పేదలు ప్రతిరోజూ ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వస్తుంటారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి సరైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

## 'ఏలూరు'లో భారీ వర్షం

**ప్రజాశక్తి - యంత్రాంగం**

ఏలూరు జిల్లాలో గురువారం పలుచోట్ల భారీవర్షం కురిసింది. గత రెండురోజులుగా ఆకాశం మేఘావృతమై తరచూ చిరుజల్లులు పడుతున్నాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నుంచి ఏలూరు నగరంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. ప్రస్తుతం వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. కల్లాల్లో, రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. పనల మీద ఉన్న వరి తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లాలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ఏలూరు పట్టణం, రూరల్, కైకలూరు, నూజివీడు తదితర మండలాల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఆయా ప్రాంతాల్లో రైతులు పంటను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. తడిసిన ధాన్యం చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని, రంగుమారి కొనుగోలు చేసే అవకాశం ఉండదని, పెట్టుబడులు, కష్టం అంతా 'నీటి'పాలేనని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రదర్శనలో గెలుపొందిన లేగదూడతో రైతు

## నెలమూరులో లేగదూడల ప్రదర్శన

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

నేటి లేగదూడలే రేపటి పాడి పశువులన్న సంగతి పాడి రైతులు గుర్తించుకోవాలని భీమవరం వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ జేసురత్నం సూచించారు. నెలమూరులో గురువారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జేసురత్నం మాట్లాడుతూ లేగదూడలను శాస్త్రీయ పద్ధతిలో పోషించినట్లయితే వాటిని మంచి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పశువుల పెంపకంపై ఉన్న దృష్టి యజమానులకు లేగ దూడలపై లేదని, లేగ దూడలకు సరైన సమయానికి పోషణ అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ప్రథమ బహుమతి యరకరాజు శ్రీనివాసరాజు, ద్వితీయ బహుమతి గొట్టుముక్కల మూర్తిరాజు, తృతీయ బహుమతి యరకరాజు శివనాగరాజుతో పాటు పలువురు రైతులకు కన్సలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు కుచ్చర్లపాటి వెంకటరామరాజు, నాయకులు ఎస్.వెంకటపతిరాజు, యరక రాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

## రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - ఆచంట**

కరుగోరుమిల్లి గ్రామంలో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు గురువారం శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంఘం పెద్దలను కోరారు. ఈ కార్యక్రమంలో ముందుగా టిడిపి నాయకులు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచి అల్లం పద్మావతి, పితాని వెంకట్, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచులు సుంకర సీతారాం, బోడపాటి బుల్లియ్య పాల్గొన్నారు.

## కులగణనతో సామాజిక ప్రయోజనాలు

**ప్రజాశక్తి - ఆచంట**

ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకత, జనాభా వారీగా అన్ని సామాజిక తరగతులకూ న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన కార్యక్రమాన్ని చేపట్టిందని ఆచంట సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కులగణనపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిసిలను రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి పర్చేందుకు ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కులగణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టిందన్నారు. బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారన్నారు. అందరికీ సమన్యాయం జరిగి బిసిలను అభివృద్ధి పరిస్తేనే ఈ రాష్ట్రం పురోగతి సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ నరసింహప్రసాద్, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

## 70వ సారి భగవాన్ రక్తదానం

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

రక్తదానంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహనతో ఉండాలని ఐసిటిసి మెడికల్ కౌన్సిలర్ జె.జేసుప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం నరసాపురం ప్రభుత్వాసుపత్రిలోని ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఆదరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ బొడ్డు కృష్ణభగవాన్ 70వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జేసు ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చన్నారు. చాలా మందికి రక్తదానం చేస్తే అనారోగ్యం పాలవుతామనే అపోహలు ఉన్నాయని, అందులో వాస్తవం లేదని తెలిపారు. ఆరోగ్యవంతుడు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని తెలిపారు. భగవాన్ 70వ సారి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ పెద్దిరాజు, సిబ్బంది వికాస్, మహేష్, ఆరోగ్య వర్షిణి సంస్థ కార్యదర్శి రాంబాబు ఉన్నారు.

## నాగరాజుకు అభినందనలు

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన తిరుమాని నాగరాజును కాపులకొడప హైస్కూల్ ఉపాధ్యాయులు కలిసి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు బొడ్డు రాంబాబు మాట్లాడుతూ ఈ గ్రామం నుంచి హైస్కూల్ చదువు చదవాలంటే ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేదని, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడేవారని తెలిపారు. కొంతమంది చదువు మధ్యలోనే ఆపేసేవారని, ఇలాంటి పరిస్థితుల్లో నాగరాజు వాళ్ల తండ్రి వడ్డీ కాసులు, స్కూల్ నెలకొల్పడానికి స్థలం ఇచ్చి ప్రోత్సహించారని తెలిపారు. అలాంటి కుటుంబంలో పదవి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్, ఆలీ, కళ్యాణ్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సర్వే పత్రాలను వినియోగించుకోవాలి

**గణపవరం:** గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత హక్కు భూ రక్షలో భాగంగా అధికారులిచ్చే ఆస్తి పత్రాల వల్ల గ్రామ కంఠంలో స్థల యజమానులకు మేలు చేకూరుతుందని డిపిఒ మల్లికార్జునరావు అన్నారు. గురువారం వెలగపల్లిలో జరిగిన సమిత్వపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి గ్రామ సర్పంచి డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ పూర్వీకులిచ్చే దస్తావేజులు లేకపోతే రీసర్వే ద్వారా ప్రభుత్వం ఇచ్చే ఆస్తికార్డు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ జాషువ, జిల్లా నోడల్‌అధికారి నవీన్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

## 26న శృంగవృక్షంలో మెగా వైద్య శిబిరం

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ఈ నెల 26న శృంగవృక్షం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎ.సూర్యప్రకాశరావు, సోము రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వేరికోసిన్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు కాళ్ల నరాలకు సంబంధించిన వ్యాధులకు రూ.4,500 విలువైన అల్ట్రా సౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. సర్జరీ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కార్డు, ఆయుష్మాన్ భవ కార్డులపై హైదరాబాద్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిపారు. పేషెంట్‌తోపాటు ఒక సహాయకుడుని కూడా ఆస్పత్రి వర్గాలు బస్‌లో తీసుకెళ్లి సర్జరీ అనంతరం తీసుకొస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కంటికి సంబంధించి వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తారని, అవసరమైన వారికి అతి తక్కువ ధరలో కళ్లజోడు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## 25న మహిళలకు కుట్టు మిషన్లు అందజేత

**ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్**

శివదేవుని చిక్కాలలో రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ శనివారం ఉచిత కంప్యూటర్, డ్రైవింగ్, టైలరింగ్‌పై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు ట్రస్టు ఛైర్మన్ నిమ్మల అనంతరామారావు తెలిపారు. వాటిని జెసి, ఆర్‌డిఒ అందజేస్తారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపి మళ్లీ రావాలి : పివిఎల్

**ప్రజాశక్తి - మొగల్తూరు**

పెనుగొండ : మాట్లాడుతున్న సర్పంచి బుజ్జి

అర్హులందరికీ సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. రామన్నపాలెం గ్రామ సచివాలయం వద్ద గురువారం జరిగిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి ఊహించని విధంగా జరుగుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం పారిశ్రామికం ఇలా అన్ని రంగాల్లో ప్రగతిని సాధించామన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో రూ.37 కోట్లు ఈ ఒక్క సచివాలయ పరిధిలో అభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం నాలుగున్నర సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతి బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఎంపిటిసిలు అయితం ధనలక్ష్మి, ఆకాన దొరబాబు, సర్పంచి బందుల ఎలీషా, కర్రి ఏసుబాబు పాల్గొన్నారు.

**ఉండి:** సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వం రావాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం యండగండి సచివాలయ పరిధిలో నిర్వహించిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైసిపి స్తూపాన్ని ఆవిష్కరించి జెండా ఎగరవేశారు. అనంతరం పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు తమ పథకాలనే కాపీ కొట్టి 2024 ఎన్నికల్లో ఓట్ల కోసం జిమ్మిక్కులు చేస్తున్నాయన్నారు. వాటిని నమ్మే పరిస్థితుల్లో ఎవరూ లేరని ప్రజలు నిరూపించాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, వైస్ ఎంపిపి దత్తాల సుజాతరాణి, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**పెనుగొండ :** ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందని సర్పంచి యర్రంశెట్టి బుజ్జి తెలిపారు. రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం రామన్నపాలెం పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. కరోనా సమయంలో వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలు కాపాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వెంకటేశ్వరరావు, బాపిరెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాంతీయ ఉత్పత్తులపై అవగాహన పెంచుకోవాలి

## నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

విద్యార్థులు విద్యతోపాటు, నైతిక విలువలను అలవర్చుకోవాలని నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి తెలిపారు. భారత ప్రభుత్వ ఆధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఇటీవల ప్రారంభించిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా నిట్ విద్యార్థులు గూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల విద్యార్థులకు మత్స్య సంపద, ఆహార ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు నాణ్యమైన విద్యతోపాటు నైతిక విలువలను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలన్నారు. ప్రాంతీయ ఉత్పత్తులపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ టి.రేష్మా పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న నిట్ యాజమాన్యం

## 9న జాతీయ లోక్ అదాలత్

### ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సురేష్‌బాబు

**ప్రజాశక్తి - భీమవరం**

వచ్చే నెల 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేసే దిశగా ఇరుపక్షాల కక్షిదారులను సమన్వయపర్చి లోక్ అదాలత్ ముఖ్యోద్దేశాన్ని తెలపాలని భీమవరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన ఛాంబర్‌లో కాళ్ల, పాలకోడేరు, వీరవాసరం పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్జి సురేష్‌బాబు మాట్లాడారు. లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించేందుకు మారుమూల గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ముందుగా రాజీ పడదగిన పెండింగ్ కేసులను గుర్తించి ఇరుపక్షాలకు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా ఎక్కువ కేసులు రాజీ చేయడానికి అవకాశం ఉందన్నారు. క్రిమినల్ కేసులతో పాటు అన్ని సివిల్ తగాదాలు, చెక్ బౌన్స్, మనోవర్తి కేసులు కూడా రాజీ చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో భీమవరం, ఆకివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్లు వై.సత్య కృష్ణ, కెవి.సత్యనారాయణ, పాలకోడేరు, వీరవాసరం ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, పి.రమేష్ పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉంటాం

### ఎఎంసి ఛైర్మన్ వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - ఉండి**

రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సేవలు అందిస్తామని ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానంతరం ఛైర్మన్ వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సలహాలు సూచనలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

## 'వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం'

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక 11వ వార్డు గునుపూడిలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు విజయం సాధించి ముఖ్యమంత్రిగా భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలతో ప్రజా సంక్షేమానికి కృషి చేస్తారని తెలిపారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎద్దు ఏసుపాదం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జులు మాదాసు కనకదుర్గ, నేదునూరి గంగాధర్ తిలక్, బండి రాజేష్, యలమంచిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యువత సోషల్ మీడియా మత్తులో పడొద్దు

రవి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నేతలు

**నరసాపురం టౌన్ :** యువత సోషల్ మీడియా మత్తులో పడకుండా ఉండాలని బొమ్మిడి కృష్ణంరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ బొమ్మిడి రవి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక మీరా గ్రంథాలయానికి బొమ్మిడి కృష్ణంరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువ చేసే బీరువాతో పాటు రెండు ఐరన్ బుక్ స్టాల్స్ అందజేశారు. ఈ సందర్భంగా రవి శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి యువత సోషల్ మీడియా మత్తులో పడి, అటు సమయాన్ని, ఇటు డబ్బును వృథా చేసుకుంటున్నారన్నారు. మంచి పుస్తకాలు చదవడం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. సమాజంలో గ్రంథాలయాలే దేవాలయాలని, గ్రంథాలయాల సేవలు వినియోగించుకుంటే బాల బాలికలు ప్రయోజకులు అవుతారని తెలిపారు. మీరా గ్రంథాలయ నిర్వాహకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ రవి శ్రీనివాస్ ఆయన తండ్రి బొమ్మిడి కృష్ణంరాజు పేరు మీదుగా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం రవి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పొగాకు నారాయణరావు, పొన్నాడ రాము, తెలగం శెట్టి సత్యనారాయణ, గంటా వేణు గోపాల్, బొడ్డు కృష్ణ భగవాన్, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

## పారదర్శకంగా విచారణ చేపట్టాలి

**మొగల్తూరు :** మొగల్తూరు సహకార సంఘంల్లో జరిగిన ఆర్థిక లావాదేవీల అవకతవకలపై 51వ విచారణ పారదర్శకంగా చేయాలని సంఘం సభ్యుడు పడవల సూర్యనారాయణ అధికారులను కోరారు. గురువారం సాయంత్రం మొగల్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.78 లక్షలపై జరిగిన అవకతవకలపై చేపట్టిన 51వ విచారణ సజావుగా సాగడం లేదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కాళీపట్నం, ముత్యాలపల్లి రెవెన్యూ భూములకు రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో చూడలేదని అంటున్నారన్నారు. ఆ భూముల రైతులు, అధ్యక్షునికి సంబంధించిన వారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆ రైతులు ఎవరని బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. 35 సంవత్సరాలుగా సంఘానికి అధ్యక్షునిగా మోటుపల్లి రామ భాస్కరరావు కొనసాగుతూనే ఉన్నారన్నారు. ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలో రూ.78 లక్షల అవకతవకలుంటే అప్పటి నుంచి అధికారులు విచారణ చేపడితే ఇంకా ఎంత ఆర్థిక లావాదేవీలు బయటపడతాయన్నారు. విచారణ పారదర్శకంగా చేపట్టి సంఘానికి, అన్నదాతలకు న్యాయం చేయాలని కోరారు. విచారణ సజావుగా లేకుంటే న్యాయస్థానాన్ని

# ఆడ పిల్లలకు రక్షణ కల్పించాలి

**ప్రజాశక్తి - గణపవరం**

సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని ఎంఇఒ పి.శేషు అన్నారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం సిహెచ్ అగ్రహారం, కాశిపాడు హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలకు కలిగే నష్టాలు, ఆరోగ్యపరమైన ఇబ్బందులను వివరించారు. ఆడపిల్లల రక్షణ విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, రవికుమార్, ఆరోగ్య సహాయకులు నామాలరాజు, ఉపాధ్యాయులు నిమ్మల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** ఆడపిల్లలను రక్షించుకోవాలని పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్లో విద్యాశాఖ, ఆరోగ్య, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు భేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం హైస్కూల్ హెచ్ఎం సాయి సూర్యనారాయణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రియాంక మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించిందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ కె.జ్యోతి, హెవి.వెంకటరమణ, సిహెచ్ఒ మిరియం, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్ :** లంకలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. వాలమర్రు సచివాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ బ్రూణ హత్యలను నివారించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి జి.హరిబాబు, సూపర్‌వైజర్ ఎస్.కె. అమలేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు అంగర రవి కుమార్, హెల్త్ అసిస్టెంట్ తారక సత్య, డిఇఒ సురేష్, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.యువతేజ, ఎఎన్ఎం సుజ్ఞానమణి పాల్గొన్నారు.

పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్ఎ రామరాజు

## అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

### ఎంఎల్ఎ మంతెన రామరాజు

**ప్రజాశక్తి - పాలకోడేరు**

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. శృంగవృక్షం గ్రామంలోని బంటుమిల్లిలో ఇంటింటికీ టిడిపి, భవిష్యత్ గ్యారెంటీ, బాబుతో మేము కార్యక్రమాన్ని టిడిపి, జనసేన నాయకులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెడుతున్న పథకాలతో పాటు జగన్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. టిడిపి వస్తే రాష్ట్రంలో స్త్రీలకు అభివృద్ధితో పాటు తగిన గౌరవం కూడా దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు జుత్తుగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్, కోటేశ్వరరాజు, కామన రాంబాబు పాల్గొన్నారు.

## రామన్నపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం

**ప్రజాశక్తి - మొగల్తూరు**

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముదునూరి

ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులకు సూచించారు. రామన్నపాలెం సచివాలయం-2లో ఆర్‌బికె వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో లోపాలు తలెత్తకుండా రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా కోత కోసి సిద్ధంగా ఉన్న రైతులు ధాన్యాన్ని వెంటనే పట్టుబడులు చేసేలా చూడాలన్నారు. గన్నీ బ్యాగులు రైతులకు సమయానికి అందించాలన్నారు. ఆకస్మికంగా ఎదురయ్యే సమస్యలపై అధికారులు చొరవ చూపాలన్నారు. జిపిఎస్ అమర్చిన వాహనంలో మాత్రమే ధాన్యాన్ని రవాణా చేయాలన్నారు. రైతు భరోసా కింద సంవత్సరానికి రూ.13,500 అన్నదాతలకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ఈదా అనిల్‌కుమారి, ఎఒ అబ్దుల్ రహీం, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఎంపిటిసి దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

## గుర్తుతెలీని మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి - ఆకివీడు**

రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభించిందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చని తెలిపారు. నీలిరంగు జీన్ ప్యాంటు, లేత తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ చొక్కా వేసుకున్నాడని తెలిపారు మృతుడు వివరాల తెలిసినట్లయితే సెల్ 9912124213 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

## వైసిపి నేతలకు ఎంఎల్ఎ పరామర్శ

**తణుకు రూరల్:** పెనుమంట్ర మండలం ఆలమూరు వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వైసిపి కార్యకర్త, పెనుమంట్రకు చెందిన కనకదుర్గమ్మవారి దేవస్థానం ఛైర్మన్ సాయి నారాయణ రెడ్డి, వైసిపి కార్యకర్త చెరుకూరి రాజును 108 వాహనంలో తణుకు యాపిల్ ఆస్పత్రిలో చేర్పించారు. వారిని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు పరామర్శించారు.

### పాస్‌పోర్టు పోయినది

KOLLABATHULA NANI BABU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 26-09-2018న **S3923352** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు ది. 15-11-2023న నరసాపురం పట్టణం మెయిన్‌రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

**KOLLABATHULA NANI BABU**
**S/o. Kollabathula Durga Rao**
**D.No. 9-1-21/2, Opp: Church**
**Church Road, Narasapuram - 534275**
**W.G.Dist., A.P.**

### పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, యలమంచిలి మండలం, యలమంచిలి ఏటిగట్టు డోర్ నెం. 8-72 కు చెందిన కొడవటి వెంకటేష్, S/o. కొడవటి ఆంజనేయులు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **P5219291** గల నా ఒరిజినల్ పాస్‌పోర్టు ది. 2-11-2023వ తేదీన మా ఇంటి వద్ద నుండి యలమంచిలి జిరాక్స్ సెంటర్‌కి జిరాక్స్ తీయించుకొను నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళ్ళుచుండగా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

**కొడవటి వెంకటేష్**
**S/o. ఆంజనేయులు, డోర్ నెం. 8-72,**
**ఏటిగట్టు, యలమంచిలి, ప॥గో॥జిల్లా**
**సెల్: 79954 79035**

### మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
### O.S. No. 376/2018

*Between:*
Canara (e-Syndicate) Bank, Tanuku
Rep. by its Manager -వాది
AND
1. శీలం దుర్గాప్రసాద్, S/o. వేంకటేశ్వరరావు, డో.నెం. 25-11-4, Old Municipality Street, Tanuku, Tanuku JCJC.
మరియు ఇరువురు -ప్రతివాద్దు

పై నెంబరు దావా ముగ్గురు ప్రతివాదులపై బాకీ మొత్తము **రూ. 95,246-07** దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తము వాది దాఖలు చేసియున్నారు. 1వ ప్రతివాది కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. సదరు పైన తెల్పిన 1వ ప్రతివాది హాజరు నిమిత్తము ది. 19-12-2023న వాయిదా అయి ఉన్నది. 1వ ప్రతివాది **ది. 19-12-2023న** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వకీలు గారి ద్వారా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10.30 ని॥లు** లగాయితు హాజరయి తమ యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకోవలెను ఇందుకు తప్పే యెడల 1వ ప్రతివాది యొక్క పరోక్షము నందు దావా తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియపర్చడమైనది. ఈ ప్రకటన మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రకటించడమైనది.

తణుకు **సి.యస్.వి.యస్.బుస్సీ**
ది.23-11-23 వాది తరపు న్యాయవాది

### మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
### O.S. No. 63/2020

*Between:*
Canara (e-Syndicate) Bank, Tanuku
Rep. by its Manager -వాది
AND
1. Bhimireddi Venkateswara Rao, S/o. Pulla Rao, RTC Driver 353/48, APSRTC, Tanuku Depot, Tanuku, Tanuku JCJC.
మరియు ఇరువురు -ప్రతివాద్దు

వాది, ప్రతివాద్దుపై బాకీ మొత్తము **రూ. 3,42,789-65 పైసలు** దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తము పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు పై నెంబరు దావా 1వ ప్రతివాది హాజరు నిమిత్తము ది. 08-12-2023న వాయిదా అయి ఉన్నది. 1వ ప్రతివాది **ది. 08-12-2023న** స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని **ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితు పై కోర్టు వారి ఎదుట హాజరయి తన యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకోవలసియున్నది. ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా 1వ ప్రతివాది యొక్క పరోక్షము నందు తీర్మానింపబడునని యిందు మూలముగా తెలియపర్చడమైనది.

తణుకు **సి.యస్.వి.యస్.బుస్సీ**
ది.23-11-23 వాది తరపు న్యాయవాది

### In the Court of the Senior Civil Judge, Tadepalligudem
### E.P. No. 24/2023
### O.S. No. 65/2007

Canara Bank (A Govt. of India undertaking) Bhimavaram, rep. by its Manager
*...D.Hr/ Plaintiff*

1) M/s. Lakshmi Packages, rep. by its Prop: L.T.Srinivasa Chakravarthy, D.no. 9-1A, Nallajerla, Nallajerla Mandal, W.G.Dist.,
2) T.Srinivas Chakravarthi, S/o. Kasi Visweswara Rao, aged 42, resident of Door No. 9-1A, Nallajerla, Nallajerla Mandal, W.G.Dist.,
3) Maddipati Satish Babu, S/o. Ratnaji Rao, aged 42, Gopalapuram, Gopalapuram Mandal, W.G.Dist.,
4) Maddipati Leela Kumari, W/o. Satish Babu, aged 39, resident of Gopalapuram, Gopalapuram Mandal, W.G.Dist.,
*...J.Drs/ Defendants*

డి.హెచ్.ఆర్/వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావాలో 1, 2 జె.డి.ఆర్స్/ ప్రతివాదులకు డి.హెచ్.ఆర్/ వాది కోర్టు ద్వారా ఆర్డర్ 21 రూల్ 22 నోటీసు ప్రాసెస్ బెటాలు కట్టిననూ 1, 2 జె.డి.ఆర్స్/ ప్రతివాదులు ఉద్దేశ్యపూర్వకంగా పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు 1, 2 జె.డి.ఆర్స్/ ప్రతివాదులు **దివి. 30-11-2023 సంవత్సరం తేదీ ఉదయం 10 గంటల** నుండి పై కోర్టు వారి ఎదుట హాజరు కాగలందులకు మరియు 1, 2 జెడిఆర్స్/ ప్రతివాదులు తమ ఆక్షేపణలు తెల్పుకొనవలసినదిగాను యీ పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది. అట్లు 1, 2 జెడిఆర్స్/ ప్రతివాదులు హాజరు కాని యెడల వార్ల పరోక్షమందు యీ ఇపి తీర్మానం కాబడగలదని యిందుమూలముగా తెలియపరచడమైనది.

**పి.నరశింహం,** అడ్వకేట్, భీమవరం
**శ్రీ కాళ్ళకూరి కుసుమ హరనాథ్**
తాడేపల్లిగూడెం అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తేదీ:22-11-2023 సెల్:9849121863